క్లుప్తంగా

రేపు వరికూటి నామినేషన్

కొల్లూరు : వైఎస్సార్ సీపీ వేమూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న వరికూటి అశోక్‌బాబు గురువారం వేమూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయ వర్గాలు మంగళవారం రాత్రి ప్రకటించాయి. కొల్లూరు విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలోని ఇందిరానగర్ కాలనీ వద్ద నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు పార్టీ శ్రేణులతో కలసి నామినేషన్ వేసేందుకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటలకు ఇందిరా నగర్ ఎస్టీ కాలనీ నుంచి ప్రారంభమవ్వనున్న ద్విచక్ర వాహన ర్యాలీకి నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపల్లెలో ఐదు నామినేషన్‌లు దాఖలు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ఐదు నామినేషన్‌లు అందినట్లు ఎన్నికల అధికారి హెలా షారోన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో నామినేషన్‌ల స్వీకరణ అనంతరం ఆమె మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా బొర్రా శ్రీనివాసరావు, బొడ్డు నాగేశ్వరరావులు నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా అంద్రాజు రామరాజు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా అంగిరేకుల ఆదినారాయణ, ఇండియన్ ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా మొరుగుపాల సదాశివరావులు నామినేషన్‌లు వేశారన్నారు. 25వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్‌లు స్వీకరించ బడతాయని చెప్పారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన వసతి గృహ విద్యార్థి

556 మార్కులతో బాపట్ల జిల్లాలో టాపర్‌గా నిలిచిన అవినాష్



భట్టిప్రోలు: భట్టిప్రోలు బాలుర వసతి గృహంలో చదువుకుంటూ పదో తరగతి పరీక్షలు రాసిన గుడిమెట్ల అవినాష్ 556 మార్కులు సాధించి బాపట్ల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వసతి గృహం సంక్షేమాధికారి ఎంవీ సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ వసతి గృహంలో నలుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అంతా ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. వీరిలో ఇరువురు విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి అరుణమ్మ, వసతి గృహ సంక్షేమ అధికారులు అభినందించారు.

పుస్తక పఠనం జీవితంలో భాగం కావాలి



బాపట్ల: పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలని గ్రంథాలయాధికారి శివాజీ గణేష్ పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా మంగళవారం భావపురి పుస్తకోద్యమ సమితి ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శివాజీ గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో పుస్తకాలకు పట్టం కట్టాలని సూచించారు. పుస్తక పఠనం మన జీవితాల్లో భాగం కావాలని, పుస్తకాలు మనల్ని ఉల్లాస పరుస్తాయని చెప్పారు. కొన్ని పుస్తకాలు మనలో ప్రేరణ కల్గిస్తాయన్నారు. సమితి అధ్యక్షుడు డాక్టర్ పి సి సాయిబాబు, కార్యదర్శి జీవీ, నటుడు నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

పేరలి(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆ సంస్థ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఈ పోలీస్‌రావు తెలిపారు. పేరలి గ్రామంలో ఇటీవల గ్యాస్ లీకై గృహం దగ్ధమైన మల్లెల సత్యంబాబు కుటుంబానికి రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తాత్కాలిక గుడారం కోసం ప్లాస్టిక్ పరదా పట్టాల గుడారం, వంటపాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గంపాల వెంకటరెడ్డి, వల్లూరి వెంకటనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారికి ఉచిత శిక్షణ

భట్టిప్రోలు: పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద 18 రకాల చేతి వృత్తుల వారికి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. దీనిలో భాగంగా ఉచిత శిక్షణతో పాటు రూ.500ల నుంచి రూ.8 వేల వరకు రివార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో బ్యాచీల వారీగా శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు 5 శాతం వడ్డీతో రుణం ఇప్పించ బడుతుందని పేర్కొన్నారు. 15 రోజుల శిక్షణకు గానూ రోజుకు రూ.500లు ప్రోత్సాహకం ఇవ్వబడుతుందని తెలిపారు. అభ్యర్థి ఆధార్, పాన్, రేషన్ కార్డుతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు తప్పని సరిగా కావాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ పాలనలో రహదారులకు మోక్షం

- ఎంపీ మోపిదేవి చొరవతో రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు
- రూ.2.70 కోట్లతో శరవేగంగా ఓల్డ్‌టౌన్–అరవపల్లి రహదారి నిర్మాణ పనులు
- రూ.2.30 కోట్ల వ్యయంతో పూర్తయిన ఓల్డ్‌టౌన్– అంకమ్మ చెట్టు రహదారి విస్తరణ
- అభివృద్ధి పనులతో రేపల్లె పట్టణంలో తీరనున్న ట్రాఫిక్ సమస్య



రేపల్లె పట్టణంలో అద్దంలా రూపుదిద్దుకున్న ఓల్డ్‌టౌన్–అంకమ్మచెట్టు రహదారి

రేపల్లెరూరల్: అభివృద్ధి, సంక్షేమం అజెండాగా సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రేపల్లె పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పాలన వికేంద్రీకరణలో భాగంగా బాపట్ల జిల్లా ఏర్పాటుతో పాటు రేపల్లెను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ప్రత్యేక చొరవతో ప్రధానంగా పట్టణానికి నలువైపులా ఆక్రమణలతో కుచించుకు పోయిన రహదారులను ప్రక్షాళన చేస్తూ రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. దీంతో పట్టణాన్ని వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఆయా ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. ఇప్పటికే రూ.2.30 కోట్ల వ్యయంతో ఓల్డ్ టౌన్ నుంచి అంకమ్మ చెట్టు వరకు రహదారి విస్తరణ పనులతో పాటు డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేసి ఓల్డ్ టౌన్‌ను గోల్డ్ టౌన్‌గా తీర్చిదిద్దారు.

ప్రస్తుతం అంకమ్మ చెట్టు సెంటర్ నుంచి అరవపల్లి రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారి సింగల్ రోడ్డు కావడంతో గతంలో ట్రాఫిక్ సమస్యలు తరచూ ఏర్పడేవి. భారీ వాహనాలు ఎదురెదురుగా తారసపడే సమయంలో ఒక వాహనం వెనక్కి వెళ్లి దారి మళ్లించిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారి అనునిత్యం వాహన చోదకులు, బాటసారులు నరక యాతన పడేవారు.

ఈ సమస్యను పరిష్కరించటంతో పాటు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వం నుంచి రూ.2.70 కోట్ల గ్రాంటును మంజూరు చేయించి రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. 250 మీటర్ల మేర 60 అడుగుల సిమెంట్ రహదారితో పాటు సీసీ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



అంకమ్మచెట్టు నుంచి అరవపల్లి వైపు నిర్మితమైన రహదారి



శరవేగంగా జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు

పచ్చపార్టీ నామినేషన్‌కు జనం కరువు

- బాపట్ల టీడీపీ అభ్యర్థి వర్మ నామినేషన్‌కు వచ్చేందుకు స్థానికుల విముఖత
- పక్క నియోజకవర్గాల నుంచి డబ్బులిచ్చి కూలీలను రప్పించుకున్న టీడీపీ నాయకులు
- జనంలేక తుస్సుమన్న టీడీపీ అభ్యర్థి నామినేషన్ ఘట్టం



బస్సుల్లో పక్క నియోజకవర్గాల నుంచి తరలి వచ్చిన కూలీలు

బాపట్లటౌన్: ఈ నెల 19న బాపట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చారు.ఇదే తరహాలో అట్టహాసంగా నామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ నిర్ణయించారు. బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం, కర్లపాలెం, బాపట్ల మండలాలతో పాటు బాపట్ల మున్సిపాల్టీ నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేందుకు ప్రయత్నించారు.

పచ్చపార్టీకి నో చెప్పిన జనం

నియోజకవర్గ వ్యాప్తంగా అధిక సంఖ్యలో జనాన్ని తరలించేందుకు టీడీపీ అభ్యర్థి వర్మ చేసిన ఫలితాలు విఫలం అయ్యాయి. ఆయన ఎంత ప్రయత్నించినా పచ్చపార్టీకు చెందిన నేతలు, కార్యకర్తలు మినహా నామినేషన్ కార్యక్రమానికి వచ్చేందుకు ప్రజలు విముఖత చూపారు. డబ్బులు ఆశ చూపినా జనంలో స్పందన కనిపించలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఇళ్లకు వెళ్లిన టీడీపీ నేతలను ఏం చేశారని మీ సభలు, ర్యాలీలకు రావాలంటూ నిలదీశారు. దీంతో చేసేది ఏమీలేక ఆయా గ్రామాల్లోని చిన్నారులకు రూ.500 నగదు, బిర్యానీ ప్యాకెట్లు ఆశ చూపి ఆటోల్లో ఎక్కించుకొని ర్యాలీకు తెచ్చుకున్నారు.



డబ్బుల కోసం ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

పక్క నియోజకవర్గాల నుంచి తరలింపు

నామినేషన్ కార్యక్రమానికి సొంత నియోజకవర్గంలోని ప్రజలు విముఖత చూపడంతో పక్క నియోజకవర్గాలైన చీరాల, పర్చూరు పరిధిలోని వేటపాలెం, జాండ్రపేట, రామాపురం తదితర గ్రామాల నుంచి మహిళలను తన సొంత కంపెనీకి చెందిన రాయల్ మెరైన్ బస్సుల్లో కూలీ డబ్బులు ఆశ చూపి తరలించారు. బాపట్ల నియోజకవర్గం నుంచి జనం రాకపోవడంతో బయట ప్రాంతాల నుంచి వర్మ జనాన్ని కూలి ఇచ్చి తెచ్చుకోవడంపై సొంత పార్టీ కార్యకర్తలే చర్చించుకోవడం కనిపించింది.

పెనుమూడిలో 18 మంది వలంటీర్లు రాజీనామా



పెనుమూడిలో కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



వేమూరులో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేసిన వలంటీర్లు

రేపల్లె రూరల్: మండలంలోని పెనుమూడి సచివాలయం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 18 మంది వలంటీర్లు రాజీనామా చేసి రాజీనామా పత్రాలను మంగళవారం సచివాలయంలో అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కరోనా కష్టకాలంలో సైతం సేవలు అందించిన తమపై ఫిర్యాదులు విరమించుకోవాలని కోరారు. ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కుచ్చెళ్లపాడు, వేమూరులో 16 మంది..

కుచ్చెళ్లపాడు(వేమూరు): మండలంలోని వరహాపురం, చదలవాడ, కుచ్చెళ్లపాడు, వేమూరు గ్రామాలకు చెందిన 16 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వారంతా రాజీనామా పత్రాలు అందించడం జరిగిందని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 154 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు చెప్పారు.

ఓలేరులో 11 మంది..

ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు సచివాలయం పరిధిలోని 11 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీదేవికి మంగళవారం అందజేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న తమ పట్ల టీడీపీ నాయకులు వ్యవహరించిన తీరు అమానుషమని వారు పేర్కొన్నారు. రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో యార్లగడ్డ రజనీకాంత్‌, పరుచూరి వేణు, తదితరులు పాల్గొన్నారు.



ఓలేరులో రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి శ్రీదేవికి అందజేస్తున్న వలంటీర్లు

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

రేపల్లెరూరల్: దోమల నిర్మూలనతో వ్యాధులను దూరం చేయవచ్చని మలేరియా యూనిట్ సూపర్ వైజర్ యల్లయ్య అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపల్లె మలేరియా యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ట్రిబుల్ ఎస్ హైస్కూలులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దోమకాటుతో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి అనేక రకాల వ్యాధులు వాటిల్లేందుకు అవకాశం ఉందన్నారు. దోమల నివారణతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో తేమ వాతావరణం లేకుండా చూసుకోవటంతో పాటు వారంలో ఒక రోజు ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలన్నారు. దోమలు ఉత్పత్తి చెందే విధానాన్ని, దోమల నివారణ మార్గాన్ని వివరించారు. అనంతరం పురవీధులలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కే.మణిమాల, ఉపాధ్యాయులు పద్మావతి, ఏఎస్ఎం మాలతి, ఆశా మల్లేశ్వరిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలనతోనే రాష్ట్రానికి భవిత




బుద్ధాంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోన వెంకట్

కర్లపాలెం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతిని గెలిపించుకోవటం ద్వారా బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసుకుందామని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ అన్నారు. వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతిని గెలిపించాలని మంగళవారం బుద్ధాం గ్రామంలో కోన వెంకట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను గడప వద్దకే అందజేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, నాయకులు గుండ్రెడ్డి శివ, ఎస్‌కె ఆసిఫ్ అలీ, అమీర్‌బేగ్, నాదెండ్ల భానుప్రసాద్, దేవరకొండ అంకమ్మ, సలగల ధర్మేంద్ర, చిక్కాల సాగర్, గొర్ల సుబ్బారావు, బుల్లెట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపుకు ఓటు వినియోగిద్దాం

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ కోరారు.మండలంలోని గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో కోన రఘుపతి తనయుడు నిఖిల్, గ్రామ సర్పంచ్ దబ్బకూటి మాధవరావు, పార్టీ నాయకులు సుబ్బారావుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి రెండో రోజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలంతా దృష్టిలో ఉంచుకుని ఓట్లు వేయాలని కోరారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, దోమ తిరుమలరెడ్డి, చేబ్రోలు సురేష్, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, డి.కోటిరెడ్డి, కుంతం ప్రసన్నరాజు, అక్కల మురళీ సముద్రాల రెడ్డి, మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాశరావు, శ్యామల నాగిరెడ్డి, సురేష్‌బాబు, కూసంపూడి దేవేంద్రరాజు, గుమ్మడి సీతయ్య తదితరులు ఉన్నారు.


శివప్రసాద్‌రెడ్డి ఎంపికపై వైఎస్సార్ సీపీ నాయకుల హర్షం



కొండ శివప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చుండూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన కొండ శివప్రసాద్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామానికి చెందిన కొండ శివప్రసాద్‌రెడ్డి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. మంగళవారం గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ మేరకు ఆయనకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, చినగాదెలవర్రు సర్పంచ్ శ్రీనివాసరావు, వుయ్యూరి సుబ్బారెడ్డి, విజయకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



← మృతి చెందిన పున్నారావు

వేమూరు: అతివేగంతో వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కొల్లూరు మండలంలోని రావికింపాడు గ్రామానికి చెందిన కొల్లి పున్నారావు(65) మంగళవారం సాయంత్రం 5 గంటలకు గేదెలకు తవుడు కోసం వేమూరు వచ్చాడు. వేమూరు నుంచి కొల్లూరు వెళ్లే రోడ్డులో తవుడు కోసం రైస్ మిల్లు వద్దకు వెళ్లుతున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కారు అతివేగంతో వచ్చి పున్నారావును ఢీకొట్టింది. పున్నారావు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. 108 వాహనం ద్వారా వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అతడు మృతి చెందాడని నిర్ధారణ చేశారు. తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించడం జరిగిందని ఎస్‌ఐ జె రాజశేఖర్ చెపారు.

మత్తు వైద్య విభాగానికి పరికరాలు వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి మత్తు వైద్యవిభాగానికి రూ.5లక్షల విలువ గల వైద్య పరికరాలను జింకానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ త్రిపురనేని రవి అందించడం అభినందనీయమని ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో జింకానా కో–ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కర రావు, డాక్టర్ హనుమంతరావులు వైద్య పరికరాలు మత్తు వైద్య విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈ వైద్య పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగ పడతాయని చెప్పారు. వైద్యులకు, పీజీ వైద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జింకాన సభ్యులు మెడికల్ కళాశాలకు, ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని విధాలా సహాయ పడుతున్నారని, వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు. అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ క్రిస్టఫర్, డాక్టర్ శ్యాంకుమార్, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ రెమిమో, డాక్టర్ శ్యాంసన్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా ఏఐదే

గుంటూరు రూరల్: రానున్న కాలం కృత్రిమ మేధ(ఏఐ)దేనని, ఇప్పటికే ఏఐతో పలు రంగాల్లో భారీ మార్పులు సంభవిస్తున్నాయని ఇ–ఎక్స్‌లెన్స్ సంస్థ సీఈవో సూర్య తెలిపారు. మంగళవారం చౌడవరం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యూచర్ ఆఫ్ జెనరేటివ్ ఏఐ అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించింది. ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధకు అనుగుణంగా విద్యా విధానాన్ని అనుసరిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.. మెరుపు వేగంతో ఏ ఐ కంప్యూటింగ్ దూసుకుపోతోందని భవిష్యత్తులో ఏ ఐ మానవాళిని శాసించే స్థాయికి చేరనుందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు.

వార్డు సచివాలయంలో చోరీ

తెనాలిరూరల్: వార్డు సచివాలయంలో చోరీపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ లింగారావు వార్డు రెండో సచివాలయం తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. లోనికి వెళ్లి కౌంటరులో ఉంచిన రూ. 26,314 అపహరించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న / చ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

ఏపీఆర్ జేసీ, పాలిటెక్నిక్ నమూనా ప్రవేశపరీక్ష

తెనాలిఅర్బన్: ప్రకాశంరోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏపీఆర్‌జెసీ, పాలిటెక్నిక్ లపై నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాఘవరావు పోటీపరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ప్రవేశపరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెట్టి విజయశేఖర్, డాక్టర్ జానకీరామ్, కె.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెదకాకాని: గుంటూరు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన మానసిక పరిస్థితి బాగాలేని మహిళ మంగళవారం మృతి చెందింది. పెదకాకాని నుంచి గుంటూరు వెళ్ళే మార్గంలో జాతీయ రహదారి చెంత అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు 108లో ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మరణించింది. మానసిక పరిస్థితి సరిగా లేని ఆమె తనపేరును లావణ్యగా చెప్పిందని, వివరాలు తెలిసిన వారు పెదకాకాని పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని సీఐ కె వీరాస్వామి తెలిపారు.

బాకీదారులను బెదిరించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: డబ్బులు అడిగిన బాకీ దారులను బెదిరించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన అంజిరెడ్డి చిట్టీ పాటలు నిర్వహిస్తుంటాడు. ఈక్రమంలో పలువురికి పాట డబ్బులు చెల్లించలేదు. మంగళవారం పాటదారులు సాంబశివరావు, వెంకటేశ్వర్లు, వీరశంకరరెడ్డి మరికొందరు అంజిరెడ్డి ఇంటికి వెళ్లి బాకీ డబ్బులు అడిగారు. అంజిరెడ్డి వారిని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవం..పేరంటాళ్లమ్మ కల్యాణం



పేరంటాలమ్మ ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురంలో శ్రీ సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో మంగళవారం రాత్రి అమ్మవారి కల్యాణం ,పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు కన్నులపండుగగా జరిగాయి. ఉదయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. రైతులు తమ పాడి పశువులను ఆలయం చుట్టూ తిప్పి పాడి అభివృద్ధి చెందాలని వేడుకున్నారు. రాత్రి నిర్వహించిన అమ్మవారి కల్యాణ మహోత్సవంలో పలు ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి అక్షింతలు, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ప్రత్యేక పూజల్లో అన్నాబత్తుని..

వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సాయంత్రం ఆలయంలో పేరంటాలమ్మ తల్లిని దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అవుతు పోతిరెడ్డి , అవుతు శేఖర రెడ్డి, అవుతు నగేశ్ రెడ్డి, అవుతు సీత, ఆరిగ చంద్రా రెడి, ఆలయ కమిటి ప్రతినిధులు ఉన్నారు.